# గౌతమీగాథలు

## ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

### చలం : అచలం

బెజవాడ దుర్గావిలాస్ భవనం ముందు జట్కా ఆగింది. ఎవరిదీ మహాభవనం! బెడ్డింగూ, సామానూ లోపలికి పట్టించాం. ఏమిటీ చొరవ? ఈ యింటి యజమాని యెవరు? తెలియకుండా లోపలికి తోసుకు పోవడమేనా?

దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మగారు నవ్వి అన్నారు. "ఆశ్చర్యపడకండి. ఇది నాగేశ్వరరావు పంతులుగారి బెజవాడ నివాస భవనం.

ప్రతి తెలుగువాడికీ యిది స్వంతమే.

ఎవరి తాహతును బట్టి వారి కిందులో ప్రవేశం వుంది. హాయిగా విశ్రమించి యెవరి పని వారు చూచుకుపోవచ్చు."

లోపలి ఒక గదిలో స్వేచ్ఛగా ప్రవేశించాం. సామాన్లు సర్దుకుని శేష రాత్రి విశ్రమించాం.

పంతులుగారు నిన్నరాత్రే మద్రాసు నుంచి వచ్చి అక్కడ ఉన్నారట. పనివాళ్ళు చురుగ్గా తిరుగుతున్నారు.

"ఇంకేం మరీ మంచిది!" అన్నారు సుబ్బమ్మగారు. మహా చొరవైన మనిషి! లేకపోతే- ఒక వంక నిప్పుకడిగే ఆచారం, రెండోవంక కుల మత వివక్షత లేని గాంధీ ఉద్యమం. ఆ నాడు సుమారు 60 ఏళ్ళ కిందట ఒక బ్రాహ్మణ వితంతువు తెగించి జాతీయోద్యమంలో దిగి- ప్రచండమైన ఉపన్యాసాలిస్తూ హరిజనోద్ధరణం- వీరఖద్దరుధారణం-ఆనాటి మగరాయళ్ళతో సమానప్రతిపత్తి సాధించి తెగేసి మాట్లాడడం- సాధ్యమయ్యే పనులేనా?

ఉగ్రసుధాటి లేనప్పుడు- నిర్మాణకార్యక్రమంలో భాగంగా ఒక జాతీయ బాలికా పాఠశాల పెట్టి నడుపుతున్నారు. అందులో తాత్కాలిక సంస్కృతోపాధ్యాయుడుగా చేరి పనిచేస్తున్నాను.

తెల్లవారింది.

స్నానాదులు ముగించి శుభ్రమైన బట్టలు కటుకున్నాం. స్వచ్ఛమైన పొందూరు ఖదరు వస్త్రం ధరించి స్ఫటిక లింగంలా వున్న సుబ్బమ్మగారు పంతులుగారిని చూచి మరీ వూళ్ళోకి వెళదామన్నారు.

విశాలమైన గదిలో మెత్తని కుర్చీమీద పంతులుగారు ఒక్కరూ కూర్చుని వున్నారు.

గది అంతా అమృతాంజనం వాసన!

పండుకూ తేపికిలాగు. పంతులుగారికీ అమృతాంజనానికీ అవినాభావ సంబంధం గాబోలు అనుకుని నవ్వుకున్నాను.

మమ్మల్ని చూసి 'రండి' అని ఎదటి కుర్చీలు చూపించారు. యోగక్షేమాలయాయి. మా పాఠశాలకు డబ్బు కావాలి. మే మెందు కొచ్చామో ఆయనకు విశదమే- ఈమె అడగదు: ఆయన చెప్పరు. ఆయన విశ్వదాత అన్నది- ఇప్పటివారు నమ్మలేనంత గొప్ప నిజం!

ఒక విద్యార్థి పరీక్షఫీజు కట్టుకోలేనని కార్డుముక్క రాస్తే మద్రాసునుంచి మనియార్డరు వచ్చేది.

కుమార్తె పెండ్లి అతివైభవంగా చేసి, సంచులు కోసి దానధర్మాలు చేసి, బెజవాడ స్టేషన్లో మెయిలెక్కితే, ఆలస్యంగా వచ్చినవారు మెయిల్లో ఆయన బోగీ ముట్టడించారట. గంట కొట్టారు. మెయిల్ కదుల్తోంది.

పంతులుగారు చేతికి వచ్చినన్ని ఐదు రూపాయలనోట్ల కట్టలు ప్లాట్‌ఫారం మీదకు విసిరి- జాగ్రత్తగా పంచుకోండి. అని వెళ్ళిపోయారట!

ఆయన నిశితమైన చూపులతోనే ఏమిస్తామన్నారో ఈమె స్థిమిత నేత్రాలతో ఏమి స్వీకరించిందో వారికే తెలియాలి!

సంతోషంగా లేచాం.

ఆ రోజున పంతులుగారి పంక్తినే భోజనం.

మల్లెపూవులాంటి ధోవతి ధరించి ఖండువా కప్పుకుని ముఖంనిండా విభూతితో- శివావతారంలా ఒక పీటమీద కూర్చుని మాకోసం ఎదురుచూస్తున్నారు.

ఆయన నాగేశ్వరులు కారు. నగేశ్వరుడిలా కనిపించారు. పెరుగు పేలాలు మాత్రమే ఆయన ఆహారంగా తీసుకున్నారు. మేం స్విష్టకృత్తుగా భోజనం చేశాం.

ఊళ్ళో తిరిగి రావడం అయింది.

ముందు షాపులో లేరనిపించిన యజమానులే యెదురుగా వచ్చి ఆమె నోటిధాటికి వెరచి పదులూ, ఏభైలూ యిచ్చి వుదారులనిపించుకున్నారు. పాఠశాలకు బాగా డబ్బొచ్చింది.

మంచి వుత్సాహంగా వుంది.

ఇంకా పొద్దుంది. ఏమిటీ చెయ్యడం?

బెజవాడ అనగానే నాకు గుడిపాటి వెంకటచలంగారు జ్ఞాపకం వచ్చారు.

సుబ్బమ్మగారు ఎంత కాంగ్రెసువాదిని. ముందడుగు భావాలు కలవైనా - పుట్టినింటి - మెట్టినింటి వైదిక వాసన పూర్తిగా పోలేదు. వెంకటచలాన్ని చూసి రావాలని వుంది. చెబితే చంపుతుందేమో అన్నంత భయం. ఊళ్ళోకి వెళ్ళొస్తా నన్నాను.

"ఎక్కడికి?". తప్పదురా దేవుడా అని చెప్పాను. ఆ గాడితప్పిన సాహసుణ్ణి చూద్దామని ఆమెకూ లోపల ఉంది కాబోలు! లోకం తిరిగిన మనిషి. జంకూ గొంకూ లేదు. నేనూ వస్తాను పదండి అంది. జట్కా కట్టించుకుని వెదుక్కుంటూ వెంకటచలం గారింటికి వెళ్ళాం.

వరెండాలో కుర్చీలమీద కూర్చున్నాం.


పావుగంట ఎదురుచూడగా కథానాయకుడు రంగంమీదకు అవతరించాడు

చేతులులేని బనియను- గళ్ళలుంగీ- పెద్ద కుంకంబొట్టు. బనియన్ జేబులో పెద్ద దువ్వెన, ఎగదువ్విన క్రాపు, విశాలమైన నుదురు, ఆ పెద్దకళ్ళు చూస్తే ఆయన పేరు తెలియకుండానే ఈయ నెవరో అసాధారణ వ్యక్తి అనిపిస్తుంది.

నన్ను నేను పరిచయం చేసుకుని ఈమె ఫలానా అని చెప్పాను. నవ్వి ఊరుకున్నారు.

"మీ రచనలు చదివి కదిలిపోయాను. కొత్త కెరటాలు ఉవ్వెత్తుగా లేచి మీద పడుతున్నట్టనిపించింది. చదవడం మానలేము. ఊపిరి తిరగదు. ఆ రచన, ఆ వేడి మీకే సాధ్యం ... మీ భావాలతో ఏకీభవించకపోయినా, ఆ శైలి...." అంటూవుంటే ఆయన ఆపి. వెగటుగా నవ్వి "విజానికి నాకు భాష రాదు. శైలిలేదు నా భావాల మారువదే - మిమ్మల్ని కలవరపరుస్తుంది. అదే శైలి అనుకుంటారు...." సంభాషణ తెంచి.... "చాలా సంతోషం.... అనుకో

(64 వ పేజీ చూడండి)




## ది మంజులా ఆర్ట్స్ అకాడెమీ బ్లోస్ ఇట్స్ ఓన్ ట్రంపెట్

(కాకినాడ)

(వెలలేనిది)

ఉత్సాహవంతులైన ముగ్గురు యువకులు ఉబుసుపోక, కాలక్షేపానికని ప్రారంభించినది 'మంజులా ఆర్ట్స్ అకాడమీ', పెద్ద ఆశయాలు కాదు గదా అసలేమీ ఆశయాలు లేకుండానే యువ చైతన్యంతో నెల్లూరు, కాకినాడ కార్యస్థానాలుగా 12 సంవత్సరాలపాటు నాటకాలు ప్రదర్శించిన మంజులా ఆర్ట్స్ అకాడమీ సావనీర్ చూడ ముచ్చటగా వున్నది. జాతీయ బహుమతులు పొందిన కె. వి. మహదేవన్, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యంగారలకు సన్మానం చేస్తూ, ఆ సందర్భంలో అకాడమీ సభ్యుల్ని, కార్యకలాపాల్ని హాస్యరసస్ఫోరకంగా పరిచయం చేశారు. ఈనాటి కుర్రాళ్ళెంత చమత్కారంగా మాట్లాడతారో తెలుసుకోవాలంటే, ఒక గమ్యం లేకుండా నిలిచిన చోట నిలువకుండా ఆవహానంతో తిరుగుతూ, నవ్వుతూ, తుళ్ళుతూ సాగిపోవటం యిందులో కన్పిస్తుంది. ఈ యువ శక్తిని ఒకమంచి లక్ష్యంతో సమాజానికి ఉపయోగపడే లాగ నడిపించటం అవసరం.

మంజులా ఆర్ట్స్ అకాడమీ ఇక మీదట కళకూ, సమాజానికీ ఇంతకంటె ఎక్కువగా సేవ చేస్తుందని ఆశిద్దాం.

—రామమోహనరాయ్

## చరిత్ర కెక్కిన చరితార్థులు

(రెండవ భాగం)

[పిల్లల కోసం వ్రాసిన జీవిత కథలు. రచయిత: డాక్టర్ చల్లా రాధాకృష్ణశర్మ. ప్రకాశకులు : యం. శేషాచలం అండ్ కంపెనీ. సికింద్రాబాదు. పుటలు: 64. మూల్యం: రు4 ]

మహాపురుషుల జీవిత విశేషాలను వివరిస్తూ, తామెన్నుకున్న ఆయా రంగాల్లో వాళ్లు చేసిన సేవను ఉగ్గడిస్తూ డాక్టర్ చల్లా రాధాకృష్ణశర్మ ఆసక్తిజనకంగా వ్రాసిన పదిహేడు పద చిత్రాలు ఈ సంపుటిలో వున్నాయి. ఇందుకోసం వివిధ ప్రాంతాలకు, వివిధ భాషలకు, వివిధ జీవిత రంగాలకు చెందిన మహనీయుల్ని ఎన్నుకోవడం జరిగింది. గాంధీజీ నెహ్రూ, శరత్‌బాబు, విశ్వదాత, తిరుపతి వేంకట కవుల వంటి అయిదారుగురి పేర్లు మాత్రమే ఇందులో తెనుగు బాలబాలికలకు సుపరిచితమైనవి. వీరితోబాటుగా ప్రగతిశీలురు యస్. శ్రీనివాస అయ్యంగారు, మలయాళ మహాకవులు ఉళ్ళూరు పరమేశ్వర అయ్యర్. కుమారన్ ఆశాన్, మరాఠీ అభ్యుదయ కవి కేశవసుత్, తమిళ నవలా రచయిత రాజం అయ్యర్, తమిళ ప్రజా కవి దేశి వినాయకం పిళ్ళె, సుప్రసిద్ధ వంగ న్యాయవాది డాక్టర్ అశుతోష్ ముఖర్జీ, విజ్ఞాన శాస్త్రవేత్త పి. సి. రే మొదలైన పెద్దల జీవితోదంతాలు ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి. ఈ జీవిత కథలకన్నింటికీ రచయిత పెట్టిన శీర్షికలు అర్థవంతంగా ఉన్నాయి. ప్రతి జీవిత చిత్రణకూ మొదట ఒక రేఖాచిత్రం ముచ్చటైన ముద్రణ

## ఎమెస్కో బొమ్మల పంచ తంత్రము

[రచన : పాలంకి వెంకట రామచంద్ర మూర్తి, బొమ్మలు : చంద్ర, పేజీలు (చందమామ సైజులో) 180, మూల్యం : రు. 10/-లు: ప్రకాశకులు: యం. శేషాచలం అండ్ కంపెనీ, సికిందరాబాదు ]

బాల సాహిత్యం ఒక ప్రత్యేక ప్రక్రియ. మన తెనుగు భాషకు సంబంధించినంత వరకు ఇందులో జరిగింది మాత్రమే కాదు, జరుగుతున్న కృషిగూడా చాలా తక్కువ. బాలల గ్రంథాలయంలో పదిలపరుచుకోడానికి పట్టుమని ఒక పది పుస్తకాల పేర్లు చెప్పమంటే చటుక్కున స్ఫురించే అవకాశం లేదు. జేబులోకి ఇమిడిపోయేటట్టుగా ఈ మధ్య విరివిగా వెలువడుతున్న జానపద నవలలు బాలబాలికల్లో ఆరోగ్యకరమైన అభిరుచులకు దోహదం కలిగించేవి కావు. రెండో మూడో పత్రికలు తప్పితే పిలలు మక్కువతో ఎదురుచూసేటగ్గ సాహిత్యం వెలువడడం లేదు. ఈ పరిస్థితిలో పంచతంత్ర కథలు సచిత్రంగా వెలువడడం ఎంతైనా ముదావహం. చిన్నయసూరిగారు వ్రాసిన మిత్రలాభం, మిత్రభేదాలు మాత్రమే తెనుగు విద్యార్థులకు సుపరిచితాలు. మిగిలిన మూడు తంత్రాలకూ అంతటి ప్రచారం లభించలేదు. 'బాలబంధు' పాలంకి వెంకట రామచంద్రమూర్తిగారు సులభశైలిలో రచించిన ఈ పుస్తకాన్ని ఏమాత్రం భాషాజ్ఞానమున్నవారైనా ఇతరుల సాయం అవసరం లేకుండా చదువుకోగలరు. పిల్లల్ని-ప్రధానంగా అలరించేది బొమ్మలే గనుక. వీటి విషయంలో మరింత శ్రద్ధ వహించి రంగుల్లో ముద్రించి వుంటే బాగుండేది. పంచతంత్రానికి మాతృకలుగా వివిధ భాషల్లో వెలువడిన గ్రంథాలను గురించి మలిపలుకులో రచయిత ఉదహరించిన అంశాలు ఆసక్తికరంగా వున్నాయి.

—యం ఆర్.

## గౌతమీ గాథలు

(12వ పేజీ తరువాయి)

కుంటా కలుసుకున్నాం" అని లేచారు వెంకటచలంగారు.

అక్కడ తొట్టెలో ఒక చక్కని పసిపాప వుంది ఆడుకుంటూ - సుబ్బమ్మగారు వుండబట్టలేక "ఈ పాప మీ అమ్మాయేనా ?" అని అడిగారు.

చలంగారు సాభిప్రాయంగా చిరునవ్వుతో "ఇక్కడ వున్నంత వరకూ మా పాపే. ఎవరో పెద్దింటి పిల్ల పెళ్ళికాకుండా ఈ పిల్లను కని యిక్కడ వుంచి ఏడుస్తూ వెళ్ళిపోయింది. మేము పెంచుతున్నాం.

డాక్టరు రంగనాయకమ్మగారు యిట్లాంటి వాళ్ళను ఆదుకొని పెంచుతారు...."

సుబ్బమ్మగారు ఆ పిల్లను గురించి యింకా ఏమడుగుతారో, చలంగారు ఎక్కడ చెలరేగుతాడో అని భయపడి ఆ ప్రసంగం తుంచి- ఖులాసాగా నవ్వుతూ వీడ్కోలు చెప్పి చరచర బండిదగ్గరకు నడిపించాను. ఇంకోసారి చలంగారితో ఆత్మీయమైన సాహిత్య ప్రసంగం ఆశిసూ.

తర్వాత మరో ఆరేళ్ళకు ఒక్కణ్ణే చలంగారిని చూసి 4 గంటలు ఆయనతో గడిపాను. ఆయన చలం కాదు; అచలం అనిపించింది. ★

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada- 10
Editor : Puranam Subrahmanya Sarma.